# చేపలు!

అది ఒక డిగ్రీ కళాశాల. సుమారు యాభై మంది లెక్చరర్లు అక్కడ పని చేస్తుంటారు. వారిలో లెక్కలేనన్ని గ్రూపులున్నాయి. వాటికి కొన్ని లక్ష్యాలున్నాయి. ప్రతి ఒక్కరూ మరొకర్ని ఏదో విధంగా ఇబ్బంది పెట్టాలనే ప్రయత్నిస్తుంటారు.

ఫలితంగా పిటీషన్లు... ఫిర్యాదులు...

ఉన్నతాధికారులు హుటాహుటిన రావడం... ఏవో దర్యాప్తులు నిర్వహించడం అక్కడ మామూలు.

ఆ రోజు సోమవారం...

'రీజినల్ డైరెక్టర్' ఆ కళాశాలలో ప్రిన్సిపాల్ మీద ఎంక్వయిరీ కోసం వచ్చారు.

లెక్చరర్లందరూ గంభీరంగా వున్నారు.

సాయంత్రం జరిగిన ఒక సమావేశంలో అందరికీ తలా ఓ కాగితం ఇచ్చారు. అందులో ఇరవై ప్రశ్నలున్నాయి. వాటికి సమాధానాలు నింపి ఆ కాగితాలు తిరిగి జాయింట్ డైరెక్టర్ కివ్వాలి.

సోషల్ వెల్‌ఫేర్ స్కాలర్ షిప్‌లలో కొంత భాగం స్వాహా చేశాడనీ, కళాశాలలో కొందరు లెక్చరర్లు అక్రమంగా ట్యూషన్లు నిర్వహించుకోవడానికి ప్రిన్సిపాల్ సహాయం చేస్తున్నాడనీ ఎవరో పిటిషన్ పెట్టారు.

పర్యవసానమే ఆ దర్యాప్తు!

మౌనంగా అందరూ ఆ కాగితాలు నింపేసి తిరిగి ఇచ్చేశారు. జవాబులు మాత్రం ప్రిన్సిపాల్ చాలా నిజాయితీపరుడనీ, ఎలాంటి కుంభకోణాల్తో సంబంధం లేనివాడనీ రాసి సంతకాలు చేశారు లెక్చరర్లు. అన్ని కాగితాలూ అందుకున్న తరువాత జాయింట్ డైరెక్టర్ చిన్న ఉపన్యాసం ఇచ్చి తను మకాం చేసిన రహదారి బంగళాకు వెళ్ళిపోయాడు.

* * *

నేను మామూలుగా ఆ రోజు ఇంటికివచ్చేశాను. జాయింట్ డైరెక్టర్ జమదగ్ని నాకు శ్రీకాకుళంలో క్లాస్‌మేట్. అతను గవర్నమెంట్ సర్వీసులోకి వెళ్ళడం... అలా అంచెలంచెలుగా జాయింట్ డైరెక్టర్‌గా ఎదిగిపోయాడు. నేను ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా జాయినయి ఎలాంటి ప్రమోషన్ లేకుండా అలాగే వుండిపోయాను. జమదగ్నీ, నేనూ శ్రీకాకుళం కాలేజీలో కలిసే నాటకాలు వేసే వాళ్ళం. కలిసి సరదాగా తిరిగే వాళ్ళం.

ఆ తరువాత స్పాట్ వేల్యుయేషన్‌లో కూడా చాలాసార్లు కలుసుకున్నాం. అలాంటిది జమదగ్ని కాలేజీలో నన్ను పలరించలేదు సరికదా ఏ మాత్రం పరిచయం లేని వ్యక్తిలా ప్రవర్తించడం నాకు చాలా బాధ కలిగించింది. ఇంతలో ఎవరో సైకిలుమీద రావడం కనిపించింది. వస్తూనే 'జాయింట్ డైరెక్టర్ గారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మన్నారు. నేను




రహదారి బంగళా బంట్రోతుని' అని చెప్పేసి వెంటనే వెళ్ళిపోయాడతను.

* * *

"నువ్వు నన్నెంతేనా అర్థం చేసుకున్నది" అంటూ ఉపోద్ఘాతం ప్రారంభించాడు జమదగ్ని. "మనిద్దరం మిత్రులం అని తెలిస్తే... నేను చేసే దర్యాప్తుకి విలువేముంటుంది చెప్పు. అందుకే అలా ప్రవర్తించాను' అంటూ ఆప్యాయంగా పలకరించి కాఫీలు తెప్పించాడు. ప్రిన్సిపాల్ మీద ఆరోపణల గురించి ప్రస్తావించాడు. నాకు తెలిసిన విషయాలు, కాలేజీ రాజకీయాల గురించి చెప్పాను. అన్నీ విని నవ్వేసి ఊరుకున్నాడు జమదగ్ని.

"రాత్రి లింక్ ఎక్స్‌ప్రెస్‌కు వెళ్దామనుకుంటున్నాను" అని చెప్పాడు. పాత రోజుల గురించి, మిత్రుల గురించి చాలాసేపు మాట్లాడుకున్నాం. లింక్ ఎక్స్‌ప్రెస్ ఆ రోజు సకాలంలోనే వచ్చింది. ఏదో కుంభ మేళ ఎక్కడో జరిగిందట. రైలు బాగా కిక్కిరిసి వుంది. ఎక్కడా రిజర్వేషన్ కాదు కదా, కాలు మోపేందుకు కూడా చోటులేదు. జమదగ్ని మొహం వాడిపోయింది.

"రేపు మధ్యాహ్నం నాకు హైదరాబాద్‌లో పని వుంది. ఈ రైలులో వెడితేనే రేపు ఉదయం ఫ్లైట్‌కి అందుకోగలను. ఎలాగైనా రిజర్వేషన్ దొరికేలా చూడు" బతిమాలాడు జమదగ్ని. అనుకోకుండా నాకు తెలిసిన టికెట్ కలెక్టర్ ఎదురుగా వస్తున్నాడు విషయం చెప్పాను.

తాను మరొక టీటీఇకి అప్పజెప్తానని, అయితే ఇరవై రూపాయిలు బెర్త్‌కి ఖర్చవుతుందని అన్నాడు. జమదగ్నితో ఇది చెప్పాను. వెంటనే ఒప్పుకున్నాడు. రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లోకి జమదగ్నిని ఎక్కించాడు ఆ టీటీఇ. రైలు కదలడానికి సిద్ధంగా వుంది. "చూడు జమదగ్నీ, ఈ రోజుల్లో అవినీతికి అర్థం మారిపోయింది. నీతికి కొత్త నిర్వచనం వచ్చేసింది. మనం అందరం అవినీతి సముద్రంలో చేపల్లాగా బతుకుతున్నాం. ఒక విధంగా నీ పబ్బం గడుపుకోవడానికి నీవు కూడా అవినీతిని ప్రోత్సహించావు...!" రైలు కూత వేసింది. అవినీతి ఆరోపణల మీద దర్యాప్తు చేసిన జమదగ్ని రూపం క్రమంగా 'దూరం' అవుతోంది.

— కిల్లాన మోహన్‌బాబు

ఓ కాలేజీ విద్యార్థిని
?
టీనేజ్ రీడర్స్ కోసం రాస్తున్న సీరియల్